తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

31-03-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 63

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## మలయాళ స్టార్లతో నాని క్రేజీ ప్లాన్!

నాని కేవలం నటుడిగానే కాకుండా, అభిరుచి గల నిర్మాతగానూ టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేశారు. ఇటీవల ఆయన నిర్మించిన 'కోర్ట్' బాక్సాఫీస్ వద్ద చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయాన్ని నమోదు చేయడమే కాక, భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఈ సక్సెస్ ఇచ్చిన జోష్‌తో నాని తన 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నారు.

8





## కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి

2

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

## ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన

- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్న బియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణ భారత దేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీని కోసం బిజెపి లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే నాకు మంచి పేరు

2

దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.



## అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్- బిల్లును వ్యతిరేకించిన బీజేపీ

3





3

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన


## జీ.ఓ.317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో సిసిని చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి



హైదరాబాద్, మార్చి30, సిరి న్యూస్‌టుడే: జీ.ఓ. నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో 317 వల్ల వేలాదిమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ జీవో రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్

మిగతా 2వ పేజీలో..



3

## లొంగిపోయిన మావోయిస్ట్ నారాయణరావు

- వారికి పరిహారం అందిస్తామన్న డీజీపీ
- ఏపీ మావోయిస్టు ఫ్రీ స్టేట్ అని ప్రకటన
- మావోయిస్టు ఉద్యమం కనుమరుగైందన్న





## పొంగులేటిని బర్తరఫ్ చేయండి

గవర్నర్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి

2



## అడ్వకేట్స్ రక్షణ అందరి బాధ్యత

- అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుపై మంత్రి

3

## యుద్ధం ఆపేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలి

### అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క

### ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే: పశ్చిమ ఆసియాలో ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య మొదలైన యుద్ధం అనేక రూపాంతరాలు చెంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. క్రూడాయిల్ ఉత్పత్తి, రవాణాలపై యుద్ధం ప్రభావం చూపుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవేదన

మిగతా 2వ పేజీలో..





## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

2



## ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలి దశ..

- సహజీవన జంటలకు కుటుంబ హోదా
- కేంద్రం కీలక నిర్ణయం

3



## నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

3

- సింగరేణికి సంబంధించి సూచనలు చేసిన కాగ్

## అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

- శాసనమండలి ప్రతిపక్ష నేత

3

## నక్సలిజం దాదాపు అంతమైంది..

మిగిలినవారు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

2






# జీ.ఓ.317ను వెంటనే రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి

చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ కు లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు గతంలో ఈ బాధితులకు న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. జీ.ఓ.317 వల్ల ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వెంటనే వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులు, ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. స్థానికతను గుర్తించే నిబంధనల్లో సమూల మార్పులు చేయాలన్నారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఎనిమిదేళ్లు, అంతకన్నా తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగులు, టీచర్లు ఆయా ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏదో ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. ఇలా ఉద్యోగులను కొత్త జిల్లాల వారీగా సర్దుబాటు చేయడానికి జీ.ఓ. 317 తీసుకు వచ్చారు. జీవో బాధితుల సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు అప్పటి సీఎస్ శాంతి కుమారి ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ కమిటీ నివేదిక ఏమయ్యిందో అర్థం కాని పరిస్థితి. శాంతి కుమారి కమిటీ ఇచ్చిన నివేదిక బయట పెడితే తప్ప జీవో నం.317 బాధితులు ఎంతమంది అనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సబ్ కమిటీ తన నివేదిక సమర్పించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం దానిని బయట పెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

# నక్సలిజం దాదాపు అంతమైంది..

**న్యూ ఢిల్లీ, మార్చి30, సిరి న్యూస్‌టుడే:**

దేశంలో నక్సలిజం దాదాపు అంతమైందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. మిగిలిన నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాల్సిందేనని స్పష్టం చేశారు. లోక్‌సభలో నక్సలిజం నిర్మూలనపై మాట్లాడిన ఆయన, బస్తర్ ప్రాంతంలో నక్సలిజం తీవ్రత గణనీయంగా తగ్గిందని వెల్లడించారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణలో కూడా అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సలిజంపై పోరులో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచారని చెప్పారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భద్రతా సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని పేర్కొన్నారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కాంగ్రెస్ పాలనలో ఆదివాసీల జీవితాల్లో పెద్దగా మార్పు రాలేదని అమిత్ షా విమర్శించారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రహదారులు, విద్య, వైద్య సేవలు వంటి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. నక్సలిజంపై పోరులో భద్రతా బలగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా వ్యాఖ్యానించారు. ప్రజలను హత్య చేసే వారిని దేశభక్తులతో పోల్చకూడదని స్పష్టం చేశారు. ఎవరికైనా అన్యాయం జరిగితే దానికి రాజ్యాంగంలోనే పరిష్కారం ఉందని, న్యాయస్థానాలు, శాసనసభలు, జిల్లా పరిషత్తులు, తహసీల్దార్ కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయుధాలు చేపట్టడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఆయుధాలు పట్టిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.



# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- గవర్నర్‌కు బీఆర్ఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్‌స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో

# ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ





- ఈగల్, హైడ్రా తరహాలో ఏర్పాటు ఆలోచన
- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్న బియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణ భారత దేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీని కోసం బిజెపి లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే నాకు మంచి పేరు
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన డియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు. పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని చెప్పారు.

**50 శాతం సీట్లు పెంచితే దక్షిణాదికి తీవ్ర అన్యాయం***

నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణ భారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా అంటూ ప్రశ్నించారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు.

**కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజులపాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని, ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు. కేసీఆర్ చెప్పిన దానికి చేసిన దానికి సంబంధం లేదని.. ఆయన ఉండటం వల్లే తనకు పేరొచ్చిందని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలు కలిపితేనే ప్రజాపాలన అని, రైతులకు అవగాహన కల్పించడంలో డియా కీలకపాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

**సన్న బియ్యం క్రెడిట్ రేవంత్‌కే : మంత్రి ఉత్తమ్**

ఏటా రూ.14,560 కోట్లు సన్న బియ్యం కోసం ఖర్చు చేస్తున్నామని, సన్న బియ్యంతో పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఆలోచన చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ఎంత భారమైనా పేదలకు మేలు చేయాలని ఆలోచన చేస్తున్నామన్నారు. జనం తినే ఆహారమే అందించాలనేది తమ ఆలోచన అని, 86% జనాభాకు సన్న బియ్యం అందుతున్నాయని చెప్పారు. సోనియాగాంధీ తెచ్చిన ఫుడ్ సెక్యూరిటీ బిల్లుకు తెలంగాణలో న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు తమ ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి రూ.40,000 కోట్లు జమ చేసిందని, ధాన్యం కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నామని, రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇప్పటివరకు మూడు కోట్ల 39 లక్షల మంది సన్న బియ్యం లబ్ధిదారులున్నారని వివరించారు. అడిగిన అందరికీ రేషన్ కార్డులను ఇస్తున్నామన్నారు.

# కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**



సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆరఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆరఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు. దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలో మీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు.. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.



## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల మొబైల్ వాహన సేవలను మెదక్ ప్రజలు ఉపయోగించుకోవాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా కోరారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ప్రిలిమినరీ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ఆయన లోక్‌భవన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనంలోని సౌకర్యాలను ఎంపీ రఘునందన్ రావు గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. హాస్పిటల్‌లో ఉండే స్క్రీనింగ్ సౌకర్యాలు ఇందులో ఉన్నాయన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే.. తగిన చికిత్స ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు.

# యుద్ధం ఆపేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలి

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఈమేరకు యుద్ధం ఆపేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో సోమవారం ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్, లెబనాన్ మీద దాడి చేస్తున్నాయని, ఇరాన్ కూడా గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను టార్గెట్‌గా చేసుకొని దాడి చేస్తున్నదని తెలిపారు. ఫైటర్ బాంబర్స్, బాలిస్టిక్ మిస్సైల్స్, డ్రోన్స్ వంటి అత్యంత ఆధునికమైన ఆయుధాలతో పరస్పర దాడులు చేసుకుంటున్నాయని, దీనివల్ల జరిగే విధ్వంసంలో అమాయకులు దాదాపు 4,000 మంది మరణించారని తెలిపారు. ఈ మరణాలతో పాటు, ఆర్థికపరమైన విధ్వంసం మరొక పక్కన జరుగుతున్నదన్నారు. మరణాలు అయా దేశాలకు మాత్రమే పరిమితమైతే ఆర్థిక విధ్వంసం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నదన్నారు. మరీ ముఖ్యంగా ఆసియా దేశాలకు మరింత ప్రమాదకరంగా మారిందని, మన దేశంపైన కూడా తీవ్రమైన ప్రభావం చూపుతోందని, కనీసం ఇంతటితోనైనా ఈ యుద్ధాన్ని ఆపకపోతే ప్రపంచ భవష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగినా ఆపకపోయినా ఇది మూడో ప్రపంచ యుద్ధానికి కూడా దారితీయవచ్చునన్నారు. ఇది ప్రపంచ మానవాళి మనుగడకే ముప్పు అని, ఇటువంటి అత్యంత ప్రమాదకర పర్యవసనాల దృష్ట్యా భారత ప్రభుత్వం చొరవ తీసుకుని యుద్ధాన్ని ఆపడానికి, ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తగిన చొరవ తీసుకోవాలని సభ ద్వారా కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నామని చెప్పారు. అనంతరం సభ ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది



## అక్రమాల పొంగులేటిని
# బర్తరఫ్ చేయాల్సిందే



- **హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే**
- **శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి**

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్ష□న్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆరఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆరఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆరఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కెలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసన

# అడ్వకేట్స్ రక్షణ అందరి బాధ్యత



- **అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ బిల్లుపై మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

న్యాయ వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమని, వారిపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, ఇది బాధాకరమని, వారి రక్షణ మనందరి బాధ్యత అని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గం రామగిరి మండలంలో పట్టపగలే న్యాయవాది గట్టు వామనరావు దంపతులను అతి కిరాతకంగా హత్య చేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ అసలు దోషులను గుర్తించలేదని, సీబీఐ విచారణ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లో పోలీసులు వామనరావు దంపతుల కేసును నీరుగార్చారని ఆయన ఆరోపించారు. అసలు దోషుల్ని తప్పించేలా విచారణను తప్పుదోవ పట్టించారని, ఈ ఘటన తర్వాతి నుంచి తమ రక్షణ కోసం ఓ ప్రత్యేక చట్టం కావాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. న్యాయవాదులపై దాడులు జరిగినా స్పందించలేదన్నారు. తమ ప్రభుత్వం న్యాయవాదుల సంరక్షణకు కట్టుబడి ఉందని, అందుకే ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును సభలో ప్రవేశపెట్టామని చెప్పారు. ఒక న్యాయవాదిగా ఇది తనకు సంతృప్తినిచ్చే అంశమని శ్రీధర్‌బాబు అన్నారు.

**మండలిలో బీఆర్ఎస్ సభ్యులకు శ్రీధర్‌బాబు కౌంటర్**

సభా నిర్వహణలో చైర్మన్‌కి సహకరించాల్సిన బాధ్యత ప్రతి సభ్యుడిపై ఉంటుందని, చైర్‌ను డిక్టేట్ చేసేలా వ్యవహరించడం తగదని బీఆరఎస్ సభ్యులకు మంత్రి శ్రీధర్‌బాబు హితవు పలికారు. మండలిలో బీఆరఎస్ సభ్యుల తీరు అప్రజాస్వామికంగా ఉందన్నారు. ప్రతి విషయాన్ని ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని మర్చిపోవద్దన్నారు. ఇది పెద్దల సభ అని, తమ రాజకీయాల కోసం సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం సరికాదని అన్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2014 నుంచి జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ చేయిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని, అయినా హౌజ్ కమిటీ పేరిట మండలిలో కూడా బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేయడం సిగ్గుచేటని అన్నారు. 201418 మధ్య బీఆరఎస్ ప్రభుత్వం మూడు హౌజ్ కమిటీలను వేసింది కానీ సక్రమంగా సమావేశాలు నిర్వహించలేదని, నివేదికలు బయటకు ఇవ్వలేదని అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు సీబీసీఐడీపై నమ్మకం లేకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు.

## ఖర్గ్ ద్వీపాన్ని
# స్వాధీనంచేసుకుంటాం



- **అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన**

**వాషింగ్టన్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకా శం ఉందని అగ్రరాజ్య అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు.'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకే మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తలపైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- **సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్- బిల్లును వ్యతిరేకించిన బీజేపీ**

**హైదరాబాద్, మార్చి 30, సిరి న్యూస్‌టుడే:**

అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం మంత్రిమండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేషపూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్‌బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు.



**బిల్లు అత్యంత ప్రమాదకరం : బిజెపి ఎమ్మెల్యే ఏలేటి**

ఈ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మాట్లాడుతూ ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని, చర్చ జరగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని,హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని తెలియజేశారు.

**ప్రజాస్వామ్య గొంతుకను నొక్కేందుకే ..**
**: కేటీఆర్ ధ్వజం**

తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక క్రూరమైన ఆయుధంగా అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని మండిపడ్డారు. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుంది అని పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం', 'సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ ఎత్తిచూపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని ఫేక్ న్యూస్ గా ముద్ర వేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. 'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పునఃపరిశీంచాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# లొంగిపోయిన మవోయిస్ట్ నారాయణరావు

- **వారికి పరిహారం అందిస్తామన్న డీజీపీ**
- **ఏపీ మావోయిస్టు ఫ్రీ స్టేట్ అని ప్రకటన**
- **మావోయిస్టు ఉద్యమం కనుమరుగైందన్న నారాయణ**

**అమరావతి, మార్చి 30, సిరి న్యూస్‌టుడే :**

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెన్నూరు నారాయణ రావు అలియాస్ సోమన్న ఏపీ డీజీపీ ముందు లొంగిపోయారు. దాదాపు 36 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కీలక పాత్ర పోషించిన నారాయణ సహా మొత్తం 9 మంది సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ, డివిజనల్, ఏరియా కమిటీలకు చెందిన మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టుల లొంగుబాటుపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ముగింపు దశకు చేరుకున్నాయని, ఏపీ ఇప్పుడు నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని డిజిపి అన్నారు. అందరి కృషితో ఇది సాధ్యమైంది. కాల్పులు కూడా జరిగాయి, లొంగుబాట్లు కూడా జరిగాయి. మా పిలుపునకు స్పందించి 9 మంది లొంగిపోయారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరపున అన్ని రకాల సదుపాయాలు అందిస్తామని వెల్లడించారు. చెన్నూరు నారాయణకు ప్రభుత్వం నుంచి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. మిగతా వారికి 24.20 లక్షలు అందిస్తున్నాం' అని చెప్పారు. మావోయిస్టు అగ్రనేత గణపతి కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి, భద్రతలు మరింత బలపడుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మావోయిస్టు నారాయణ మాట్లాడుతూ.. గతంలో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయని చెప్పారు. దేశంలో మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. సాయుధ పోరాటాన్ని వదిలి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని తాను లొంగిపోయినట్లు నారాయణ చెప్పుకొచ్చారు. 1990లో ఉద్దానంలో ప్రజా ఉద్యమానికి ఆకర్షితులు అయ్యాను. అప్పుడే మావోయిస్టు పార్టీలో చేరాను. పార్టీ తీర్మానాలకు అనుకూలంగా పని చేశాను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేశాను. నేను మావోయిస్టు ఉద్యమాల్లో చేరినపుడు పరిస్థితులు, ఇప్పుడు చాలా మారాయి. మేం పనిచేసిన ఆదివాసీ అటవీ ప్రాంతంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందిస్తోంది. ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా పార్టీ అప్డేట్ కాకపోవటమే ఈ వైఫల్యానికి కారణం. వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా పార్టీ నిర్ణయాలు తీసుకోవటంతో ఈ పరిస్థితి వచ్చింది. మావోయిస్టు పార్టీ పరిస్థితులకు అనుగుణంగా అప్డేట్ అవలేదు, అందుకే ఏవోబీ సహా



దేశ వ్యాప్తంగా పార్టీ కనుమరుగు అయింది' అని నారాయణ వివరించారు. 'సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతాలు మారలేదు. అందువల్లే పార్టీ ఇలా అయింది. పార్టీ హత్య చేసిన ఘటనల్లో నేను కూడా భాగస్వామి అయ్యాను. అయితే పార్టీ నిర్ణయాల్లో భాగంగా మాత్రమే అవి జరిగాయి. నాకు ఎవరితో వ్యక్తిగత విభేదాలు, శత్రువుత్వం లేదు. జరిగిన ఘటనకు నేను పశ్చాత్తాపపడుతున్నా' అని మావోయిస్టు నారాయణ చెప్పారు. నారాయణరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం. ఆయన దాదాపు 35 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. 1990లో పీపుల్స్ వార్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో దిట్ట అనే పేరు నారాయణకు ఉంది. ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తూ.. పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. ఏపీ, ఒడిశాల్లో

## నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

- **సింగరేణికి సంబంధించి సూచనలు చేసిన కాగ్**

**హైదరాబాద్,,మార్చి30, సిరి న్యూస్‌టుడే:**

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్‌ఆర్‌సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.





# ఏప్రిల్ 1 నుంచి జనగణన తొలి దశ..

- **సహజీవన జంటలకు కుటుంబ హోదా**
- **కేంద్రం కీలక నిర్ణయం**

**సిరి న్యూస్‌టుడే**

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన2027 తొలి దశ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి మొబైల్ యాప్ ద్వారా హౌజ్ లిస్టింగ్- హౌజింగ్ సెన్సస్ (HLO) నిర్వహించనున్నారు. వివాహం చేసుకోకుండా కలిసి జీవిస్తున్న జంటలను ఒకే కుటుంబంగా గుర్తించాలని కేంద్రం నిర్ణయించింది. సహజీవన జంటలను పెళ్లైన దంపతుల మాదిరిగానే పరిగణించనున్నారు. తొలిసారిగా ప్రజలకు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు 33 ప్రశ్నలతో కూడిన సమాచారాన్ని పోర్టల్‌లో పొందుపరిచారు. హౌజ్ లిస్టింగ్ సమయంలో ఇదే ప్రశ్నావళి ఆధారంగా సమాచారం సేకరించనున్నారు. జనగణన సమాచారం గోప్యమే:



రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్

జనగణనలో ప్రజలు ఇచ్చే సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బహిర్గతం చేయబోమని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. జనగణన చట్టంలోని సెక్షన్15 ప్రకారం సేకరించిన సమాచారాన్ని కోర్టులకు గానీ, ఇతర సంస్థలకు గానీ ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో జరగనుంది. గృహగణన కోసం 19 భాషల్లో ప్రశ్నావళి సిద్ధం చేశారు. ప్రత్యేక మొబైల్ యాప్‌ను 16 భాషల్లో అందుబాటులో ఉంచనున్నారు. గృహగణన పూర్తయ్యాక రెండో దశలో కుల గణనతో కలిపి పూర్తి జనగణన నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏప్రిల్ 16 నుంచి నెలరోజుల్లోగా గృహగణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం

- బొంతపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**గుమ్మడిదల, మార్చి 30( సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి 21 వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ శ్రీ చూర్ణం చక్రపాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్ కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపర్చడం తమ లక్ష్యమని తెలిపారు. బొంతపల్లి 21వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న దుమ్ము, మట్టి, మురుగు నీటి సమస్యలు తగ్గుతాయని చెప్పారు. వర్షాకాలంలో రహదారులు దెబ్బతినడం, ప్రయాణంలో ఇబ్బందులు కలగడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. అలాగే పట్టణంలోని అన్ని వార్డుల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు కొనసా గుతున్నాయని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపా యాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా పనుల అమలులో సహకరించాలని నాణ్యతతో పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, కుమార్ గౌడ్, విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి, నాయకులు హుస్సేన్, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన బాలికలు వ్యాక్సిన్ వేయించుకోవాలి

- గుమ్మడిదలలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం

**గుమ్మడిదల, మార్చి 30( సిరి న్యూస్):**



గుమ్మడిదల మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలలో 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు నిండని బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ బాలికల ఆరోగ్య పరిరక్షణలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గర్భాశయ ముఖ క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంలో ఈ టీకా ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, అర్హత గల బాలికలకు తప్పనిసరిగా టీకా వేయించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. అలాగే ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మధుకర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు పద్మ వెంకట్రామిరెడ్డి, అబిశెట్టి రాజశేఖర్, చూర్ణం చక్రపాణి, సురభి కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు హుస్సేన్, పొన్నాల శ్రీనివాసరెడ్డి, తుపాకుల రాజు, మద్ది శంకర్ రెడ్డి, సప్పటి మహేష్, హెచ్ఈఓ శ్రీనివాస్, అనసూయ స్టాఫ్ నర్స్, శ్రీనివాస్ ఫార్మసీ ఆఫీసర్, కళ్యాణి, స్వరూప, శాంతన, శారద తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# టీకా తప్పనిసరి






- తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

**పటాన్ చెరు, మార్చి 30, (సిరి న్యూస్);**

యుక్త వయసు లో అడుగు పెడుతున్న యువతులు తప్పని సరిగా గర్భస్థ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రజా పాలన లో అమలు చేస్తున్న ఆరోగ్య సంరక్షణ పథకం ఎచ్ పీ వీ నీ తప్పక తీసుకోవాలని పటాన్ చెరు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం పటాన్ చెరు లో ప్రజాపాలన ఆరోగ్య శిబిరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగ పటాన్ చెరు లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన ఆరోగ్య శిబిరం కార్యక్రమం అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు పటాన్ చెరు మాజీ జడ్ పీ టీ సీ సభ్యులు ఎం. జైపాల్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగ ఎచ్ పీ వీ ( హ్యూమన్ పాపిలోమా వైరస్ ) టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరంలో ఆడబిడ్డలకు సర్వైకల్ క్యాన్సర్ మరియు రొమ్ము క్యాన్సర్ లాంటి ప్రాణాంతక రోగాల నివారణకు ప్రభుత్వం ఉచితంగా ఎచ్ పీ వీ టీకా మందు వేయడం జరుగుతుందని అన్నారు. ఈ శిబిరంలో ఇంకా ఎన్నో ఆరోగ్య పరీక్షలు, మందులు ఇవ్వడమే కాకుండా, గైనకాలజి, జనరల్ ఫిజిషియన్, పీడియాట్రిషియన్, ఆప్తమాలజీ,డెంటల్, ఆర్థోపెడిక్ నిపుణులైన వైద్యులచే మంచి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఈ సదవకాశాన్ని స్థానిక ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ,అజ్మత్ అజ్జు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు

- టెక్నాలజీని ఉపయోగిస్తూ భద్రతకు ప్రాధాన్యత
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- సంగారెడ్డి సబ్ డివిజన్ పోలీసు కార్యాలయం ప్రారంభం

**సంగారెడ్డి, మార్చి 30 (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా పోలీసులు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడానికి మరో పెద్ద అడుగు ముందుకు వేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ పక్కన నూతన సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువగా మరియు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడమే ఈ కొత్త కార్యాలయం ప్రారంభ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం సిబ్బంది కార్యకలాపాలను సులభతరం చేయడంతో పాటు ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం లభించేలా చేస్తుందన్నారు. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, డీసీఆర్బీ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్స్ రమేష్, రాము నాయుడు, రామకృష్ణ రెడ్డి, కిరణ్ కుమార్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావ్, అనిల్, సబ్-డివిజినల్ పోలీసు అధికారులు, డిఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

## ప్రత్యక్షంగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



**సంగారెడ్డి, 30 మార్చి 2026 (సిరి న్యూస్):**

ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ప్రతినిధులు ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ చేసి, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఎస్పీ గారు సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా, ఎలాంటి మధ్యవర్తిత్వం అవసరం లేకుండా “ప్రజావాణి” కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ విధంగా, జిల్లా పోలీసులు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, సమయానికి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలతో అవిశ్రాంత సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.

# సంగారెడ్డిలో 219 సెల్ ఫోన్ల రికవరీ

- సీఈఐఆర్ పోర్టల్లో బ్లాక్ చేసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి
- సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు జాగ్రత్త
- ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి, మార్చి 30 (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళాను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. పోగొట్టుకున్న 219 సెల్ ఫోన్లను రికవరీ చేసి ఈ రోజు బాధితులకు అందజేస్తున్నామని, రాష్ట్రం అంతటినీ, పొరుగు రాష్ట్రాలనూ కవరుచేసి ప్రత్యేక బృందాలను నెల రోజులుగా ఏర్పాటుచేసి ఫోన్లను తిరిగి పొందామన్నారు. ఈ రోజుల్లో మొబైల్ ఫోన్ లేకుండా వ్యక్తిగత లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు, పాస్‌వర్డ్లు వంటి రహస్య సమాచారాన్ని సురక్షితం చేయలేమని, సైబర్ నేరగాళ్లు ఫోన్లను దొంగిలించి డబ్బులు దోచుకుంటున్నారు. అందువలన ఎవరైనా ఫోన్ పోగొట్టిన లేదా దొంగి లించబడిన సందర్భంలో వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసేటప్పుడు షాప్ యజమానికి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. దొంగిలించబడిన ఫోన్ అని తెలిసినా కూడా కొనుగోలు చేస్తే, ఆ వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్, సైబర్ సెల్, ఎస్-న్యాబ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు కీలకంగా వ్యవహరించారు.

# మంచినీటి సమస్యను పరిష్కరించడమే తక్షణ లక్ష్యం

## నూతన బోరు ఏర్పాటు పనులకు శంకుస్థాపన



**గుమ్మడిదల, మార్చి 30( సిరి న్యూస్ )**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం 5వ వార్డు కేసీఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నూతన బోరు ఏర్పాటు పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ మేడిపల్లి మురళి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బోరు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడం మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కిషన్, సంజీవ రెడ్డి, రాజశేఖర్, చక్రపాణి, కుమార్ గౌడ్, విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నాయకులు హుస్సేన్, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, ఆంజనేయులు యాదవ్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొంపల్లి సర్కిల్-56 పరిధిలో పర్యటించిన జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

కొంపల్లి,మార్చ్-30(సిరి న్యూస్).



కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సోమవారం నాడు కొంపల్లి సర్కిల్-56 పరిధిలో పర్యటించారు.ఈ సందర్భంగా సాయిబాబా నగర్ మరియు రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో శానిటేషన్ పనులను డి.సి.కృష్ణారెడ్డి ని అడిగి తెలుసుకున్నారు.ప్రత్యేకంగా C&D (Construction & Demolition) వ్యర్థాల ఎత్తివేత పనులను సమీక్షిస్తూ, వీటిని సమయానికి పూర్తిగా తొలగించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం,ఎక్కడైనా వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.అలాగే డిప్యూటీ కమిషనర్ శ్రీ ఎన్. కృష్ణా రెడ్డి గారు సంబంధిత అధికారులతో కలిసి పనుల పురోగతిని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, సిబ్బంది క్రమం తప్పకుండా ఫీల్డ్‌లో పనిచేయాలని జోనల్ కమిషనర్ గారు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో DEE తిరుపతి,AE కృప,శానిటేషన్ సూపర్వైజర్ కె.పోతా రెడ్డి. మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొంపల్లి సర్కిల్ కార్యాలయం పై ఏ.సి.పి.అధికారుల తనిఖీలు ఎప్పుడో.?




కొంపల్లి,మార్చ్-30 (సిరి న్యూస్).

నాటి గ్రామపంచాయతీగ ఉండి గడిచిన ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీగ మరీనా కొంపల్లి ప్రస్తుతం జి.హెచ్.ఎం.సి.లో విలీనం చేసి కొంపల్లి సర్కిల్ గ అక్కడి అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.కొంపల్లి సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాలలో భారీగా అవకతవకలు జరుగుతూ అందినకాడికి దోచుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు చెవులు కోరుకుంటున్నారు.ప్రస్తుత టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎవ్వరు విధులు నిర్వహిస్తున్నారు.విద్యుత్ విభాగంలో ఎవ్వరు ఉన్నారు.అనేది ఎవరికి అర్ధం కావడం లేదు.దీనిపై సమీకృతంగా ఏ.సి.పి.అధికారులు తనిఖీలు నిర్వహించి కార్యాలయాన్ని సక్రమంగా ప్రజలకోసం విధులు నిర్వహించే అధికారులను అందుబాటులోకి తీసుకురావాలని అంతే కాకుండా భవన నిర్మాణానికి అనుమతులు ఒక్కటి నిర్మాణం మరొక్కటి ఇష్టానుసారంగా అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్న అధికారులు మాత్రం తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపడుతూ మరుసటి రోజు అధికారులను కలవగానే అక్రమ నిర్మాణం కాస్త సక్రమం అవుతుందని అందరూ టౌన్ ప్లానింగ్ అధికారులే అంటూ పలువురు వసూళ్ల రాయుళ్లకు సెల్యూట్ చేస్తున్నారు.ఇలాంటి సక్రమ విధులు నిర్వహించని వారిపై ఏ.సి.పి.అధికారుల చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి పనులకు భూమిపూజ

భోరజ్,మార్చ్-30(సిరి న్యూస్).



భోరజ్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దీపక్ రావు, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రూ.15 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణ పనులు, రూ.4 లక్షలతో ప్రభుత్వ హైస్కూల్‌లో వంట షెడ్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలకు న్యాయం జరిగిందని, ప్రస్తుతం కూడా గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రానున్న ఐదేళ్లలో కూడా భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శాంతన్ రావు, కోరటా గ్రామ సర్పంచ్ ఇందూరి వామన్, పెందల్వాడ భూమారెడ్డి, మామిడి మల్లారెడ్డి, నాయిడి ప్రకాష్, నిమ్మల ప్రభాకర్, పుట్ట అశోక్, శైలేందర్ రెడ్డి, రాజారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవగాహనతో డిజిటల్ మోసాలను అధిగమించండి





- గీతం విద్యార్థులకు సైబర్ నిపుణుల సూచన
- సైబర్ అవగాహనపై చైతన్యపరచేలా శిక్షణ

పటాన్ చెరు, మార్చి 30, (సిరి న్యూస్):

సైబర్ నేరాలను నివారించడానికి అవసరమైన జ్ఞానాన్ని సమకూర్చుకుని, అవగాహనతో డిజిటల్ మోసాలని అధిగమించాలని హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు సైబర్ నిపుణులు సూచించారు. సైబర్ భద్రతపై మరింత అవగాహనను సమాజంలో వ్యాప్తి చేయగల బాధ్యతా యుతమైన డిజిటల్ పౌరులుగా ఎదగాలని అభిలషించారు. గీతంలోని సైబర్ స్పేసుపై అవగాహన, బాధ్యతాయుతమైన కార్యక్రమం (స్పార్క్ క్లబ్) విద్యార్థుల కోసం 'సైబర్ అవగాహన, చైతన్య సదస్సు'ను సోమవారం నిర్వహించారు. దీనిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, న్యూఢిల్లీకి చెందిన ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్), సైబరాబాదుకు చెందిన సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ స్వల్ప వ్యవధి శిక్షణ కార్యక్రమంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ ఎస్.వి.హరికృష్ణ, సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సీఎస్సీకి చెందిన రష్మి శ్రీవాస్తవ, ఇండియా ఫ్యూచర్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్)కు చెందిన శాలిని రాథోర్, శిఖర్ ద్వివేది వంటి నిపుణులు పాల్గొని, సైబర్ సెక్యూరిటీ పై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండటంపై ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, ఆసక్తికరమైన, ప్రయోగాత్మక శిక్షణా కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. బాధ్యతాయుతమైన ఆన్ లైన్ ప్రవర్తనను నిపుణులు ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఎలాంటి హానికరమైన లేదా అనైతిక డిజిటల్ కార్యకలాపాలను ప్రోత్సహించవద్దని, ఒకవేళ ఏదైనా ఆన్ లైన్ మోసం జరిగిన వెంటనే సైబర్ నేరాల జాతీయ హెల్ప్ లైన్ 1930లో కానీ, లేదా cybercrime.gov.in ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, సైబర్ పరిశుభ్రతపై అవగాహన, పాస్ వర్డ్ నిర్వహణ, ప్రామాణీకరణ ఉత్తమ పద్ధతులు, ఈ-మెయిల్, మెసేజింగ్, సోషల్ మీడియా ప్లాట్ ఫారాల సురక్షిత వినియోగం వంటి కీలక అంశాలను సృజిస్తూ, 'సైబర్ హైజీన్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్'ను నిర్వహించారు. స్పార్క్ క్లబ్ ద్వారా తమ సమాజాలలో సైబర్ అవగాహనను వ్యాప్తిచేయడం లో చురుకుగా పాల్గొనమని విద్యార్థులను ప్రోత్సహించారు. పరిశ్రమ నిపుణుల నుంచి నేరుగా నేర్చుకునే ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని గీతం కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రజోపయోగం కోసం ఉమ్మడి కార్యక్రమాలకు గల మార్గాలను అన్వేషించడానికి గీతం సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ లను సందర్శించాలని నిపుణులను సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా ఆహ్వానించారు. ఈ కార్యశాలను కృత్రిమ మేధస్సు-డేటా సైన్స్ (ఏఐ&డీఎస్) విభాగాధిపతి డాక్టర్ వి.శిరీష నిర్వహించగా, అదే విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శశివర్ధన్ సమన్వయం చేశారు.



# ట్రాఫిక్ అధికారుల చర్యలు శూన్యం





- అంత మా ఇష్టం
- మాల్స్ కి వత్తాసు పలుకుతున్న ట్రాఫిక్ అధికారులు.
- పేరుకే నో పార్కింగ్ సూచిక బోర్డు.
- ట్రాఫిక్ అధికారుల కనుసైగ్గలో మాల్స్.

కొంపల్లి,మార్చ్-30(సిరి న్యూస్).

ట్రాఫిక్ అధికారుల విధులు కేవలం కుర్చీలకే పరిమితమా అంటే నిజమే అని తెలుసుకోవచ్చు.నిత్యం ట్రాఫిక్ నియంత్రిస్తున్నం అనుకుంటూ భ్రమలో ఉంటున్నారు అధికారులు నో-పార్కింగ్ సూచిక బోర్డు ఉన్న కూడా సుచిత్ర నుండి మొదలుకొని కొంపల్లి వరకు మాల్స్ ముందు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్న ఆ వాహనాలకు మాత్రం ఎలాంటి చలాన్లు వేయకుండా మాల్స్ వారికీ వత్తాసు పలుకుతూ కాలయాపన చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.పేరుకే నో-పార్కింగ్ బోర్డులు పాటించేది ఎవ్వరు........? మాల్స్ కి పార్కింగ్ కోసం సెల్లార్లు ఉన్న కూడా వాటిని పాటించకుండా వారివారి అవసరాలకు ఉపయోగించుకుంటు షాపింగ్ కి వచ్చిన వాహనాలను పూర్తిగా రోడ్డులో నిలపడంతో సర్వీస్ రోడ్డు పూర్తిగా సాయంత్రం వేళల్లో మరియు ఉదయం భారీగా ట్రాఫిక్ జాం అవుతూ ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.దీనిపై స్థానిక ట్రాఫిక్ అధికారులు ఉన్నారా లేరా..... అనే కోణంలో ప్రయాణికులు వాపోతున్నారు.అధికారులు ఉన్న వారు కేవలం రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్టాల్స్ వద్ద నామమాత్రం చలాన్లు వేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.ఎంత మంది అధికారులు మరీనా కూడా స్థానికంగా ట్రాఫిక్ కష్టాలు మాత్రం తప్పడం లేదు స్థానిక ఏ.సి.పి.మరియు సి.ఐ చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సిందే.




# 'ఆశ'ల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సమ్మెకు సిద్ధం




- సిఐటియు ఆందోల్ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్
- జోగిపేటలో సీఐటీయు ఆధ్వర్యంలో రాస్తారోకో

అందోలు, మార్చి 30, (సిరి న్యూస్):

ఆశల డిమాండ్‌లు నెరవేర్చకుండా నిర్లక్ష్యం వహిస్తే సమ్మె చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని సిఐటియు ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్ హెచ్చరించారు. సోమవారం జోగిపేట హనుమాన్ చౌరస్తా వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్‌లను పరిష్కరించాలని, సీఐటీయు జిందాబాద్ అంటూ నినాదాలు చేసారు. సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకిరి చేయిస్తున్నాయి తప్ప వారి సమస్యలు పరిష్కరించడం ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల సమయంలో ఆÔ¶ కార్యకర్తలకు ఫిక్సుడ్ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, దీనికి సంబంధించి అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని అనంతరం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పని భారం పెరుగుతుంది తప్ప వారి బతుకులు మారడం లేదని ఆయన అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని ఆయన కోరారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సైతం ఆశాలు పనిచేశారని, అప్పట్లో ఎందరో ఆశ కార్యకర్తలు చనిపోయిన వారికి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి వారి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని అన్నారు. ఆశాలకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి యశోద, గంగమణి, విమల, మానెమ్మ, పద్మ, అడివి అమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఫోటో: జోగిపేటలో ఆశ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

# ట్యాక్స్ లు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

తూప్రాన్ మార్చ్ 30 సిరి న్యూస్




తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని వ్యాపారస్తులకు ఇంటి పన్ను యజమానులకు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి సోమవారం రోజు2025-26 ఆర్థిక సంవత్సరం రేపటితో ముగిస్తున్నందున 31.03.2026 ఇప్పటి వరకు బకాయి దారులు అందరూ కూడా మీ యొక్క ఇంటి పన్నులు వ్యాపార టాక్సీలు పూర్తిగా చెల్లించి పెనాల్టీ భారం నుండి ఉపశమనం పొంది తూప్రాన్ పట్టణ అభివృద్ధికి సహకరించగలరని తూప్రాన్ పట్టణ ప్రజలను ఉద్దేశించి ఈ ఆర్థిక సంవత్సరానికి 100 శాతం చెల్లింపులు జరపాలని మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి తెలిపారు.

# జోగిపేటలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల వంటా వార్పు

- జోగిపేట డీఈ కార్యాలయం వద్ద ధర్నా





అందోలు, మార్చి 30, (సిరి న్యూస్):

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీ.వీ.ఎ.ఈ. జేఏసీ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జోగిపేట డివిజన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ధర్నాలో భాగంగా 'వంటా వార్పు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఏపీఎస్సిబి రూల్స్ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలని. ఆర్టిజన్ కార్మికుల ను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని మరియు మీటర్ రీడింగ్ వర్కర్లను మరియు పోల్ టు పోల్ వర్కర్లను ఎఫ్ ఓ సి వర్కర్లను కూడా విద్యుత్ సంస్థలను విలియం చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జోగిపేట డివిజన్ విద్యుత్ కార్మికులు 327 యూనియన్ నాయకులు లక్ష్మయ్య, మొగులయ్య, బాలరాజ్, కృష్ణ దేవరాయలు కార్మికులకు మద్దతుగా కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రంజిత్, జోగినాథ్, రాజేందర్, సాయిలు, పవన్, నాగరాజు, మల్లేశం, సుదాకర్, హరికృష్ణ, సంతోష్, వసీం ముఖ్తార్ పాష తదితరులు పాల్గొన్నారు.

1) జోగిపేటలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల వంటా వార్పు
2)జెజిపి02ఏః జోగిపేటలో ధర్నా చేస్తున్న దృశ్యం

# మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో చురుకైన పాత్ర

- ఘనంగా వైస్ చైర్మన్ సంధ్య జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు



గుమ్మడిదల, మార్చి 30 ( సిరి న్యూస్):

గుమ్మడిదల పురపాలక సంఘం వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆమెను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సంధ్య గోవర్ధన్ రెడ్డి నివాసం వద్ద ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు ఆమెకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి జన్మదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనుల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆమె సేవలను పలువురు కొనియాడారు. ప్రజలతో సాన్నిహిత్యం పెంపొందించుకుని సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో మరింత పేరు ప్రతిష్టలు సాధించాలని నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, సిజిఆర్ ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# నిందితులకు హరీశ్ వత్తాసు

పటాన్ చెరు, మార్చి 30, (సిరి న్యూస్):



దేవాలయం లాంటి పవిత్రమైన అసెంబ్లీలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అభివృద్ధి గురించి, ప్రజా సమస్యలపై మాట్లాడితే బాగుండేదని, అసెంబ్లీలో మైనింగ్ పై చర్చ జరిగిన సందర్భంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తమ్ముడు గూడెం మధుసూదన్ రెడ్డి వందల కోట్ల రూపాయల అవినీతిని చిన్న తప్పు అని సంబోదించటం ఎంత వరకు సమంజసమని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఎద్దేవా చేశారు. సోమవారం రామచంద్రాపురం పట్టణం అశోక్ నగర్ లో కాట శ్రీనివాస్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... హరీష్ రావు నిజాయితీ పరుడైతే గూడెం మధుసూదన్ రెడ్డి మైనింగ్ అవకతవకలపై సిబి సీఐడికి ఎంక్వేయిరి వేయించండని డిమాండ్ చేశారు. స్కామర్ల కు, అవినీతి పరులకు, కబ్జా దారులకు వత్తాసు పలుకుతూ హరీశ్ రావు మాట్లాడటం దురదృష్టకరమన్నారు. హరీష్ రావు మంత్రిగా ఉన్నప్పుడే లక్డారం లో అక్రమ మైనింగ్ జరుగుతుందని, అప్పటి మైనింగ్ అధికారులు క్లోజర్ లెటర్ ఇవ్వడం నిజం కాదా అని ప్రశ్నించారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని క్రషర్ల కు సంబంధించి దేనికి సరైన అనుమతులు లేవన్నారు. 2023లో 38 క్రషర్లలో ఎన్ క్రోచ్ చేసుకుని మైనింగ్ చేస్తే మీరే అదికారం లో ఉండి ఏం చేశారన్నారు. 380 కోట్ల అక్రమ మైనింగ్ సంపాదన చిన్న విషయమా అని ఆయన ప్రశ్నించారు. అక్రమ మైనింగ్ మాఫియా జరుగుతున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం ఊరుకుందంటే మీ వాటా ఎంత అని ప్రశ్నించారు. కబ్జాదారుల ను, అక్రమ మైనింగ్ మాఫియాను వెన కేసుకుని వస్తున్న హరీష్ రావుకు భాగస్వామ్యం, వీటిపై ఆయన వాటా ఉందా అనే అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములలో వందల కోట్ల రూపాయల స్కాం జరిగితే ఏం చేశారని ఖాజీ పల్లి, కుత్బుల్లాపూర్ సరిహద్దుల్లో ఫైర్ స్టేషన్ కోసం 90 కోట్ల కుంభకోణం పై ఏం చేశారని ప్రశ్నించారు. ఇంద్రేశం 450 సర్వే నంబర్ లో 1.12ఎకరాల భూమి, పోచారం సర్వే నంబర్ 62 లో వంద ఇళ్లు, భూ కబ్జాల తో వందల, వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడిన ఎమ్మెల్యే, అనుచరులపై చర్యలేవి అన్నారు. పాటి గ్రామంలోని ఆనంద్ నగర్ లో ఎమ్మెల్యే మేనల్లుడు జంగారెడ్డి కబ్జా చేసి ప్లాట్ల ఓనర్ల పై దౌర్జన్యం చేస్తే హైడ్రా కాపాడిందన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన అక్రమాలకు వాళ్లు ఇళ్లలో కన్నా జైళ్ల లోనే ఎక్కువ రోజులు ఉండాల్సి ఉంటుందన్నారు. ఆరుట్ల లో అక్రమ మైనింగ్ జరిగినా అపుడు ఎవరూ పట్టించుకోలేదని, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అక్రమాలపై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆస్తులను కాపాడుకోవడానికి ఊసరవెల్లి అవతారం ఎత్తు తాడని, పార్టీ ఫిరాయింపు దారుడు, కబ్జా దారుడు, అక్రమ మైనింగ్ మాఫియా చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి, అతని తమ్ముడు మధుసూదన్ రెడ్డి లకు మద్దతు పలుకుతున్న హరీశ్ రావుకు చిత్తశుద్ధి ఉంటే సిట్ వేయాలన్నారు. కల్వకుంట్ల కవిత 5 నెలలు జైలులో ఉంటే బాధ పడని హరీశ్ రావుకు గూడెం మధుసూదన్ రెడ్డికి వత్తాసు పలకడం వెనుక హరీశ్ రావు వాటా ఎంతో వెల్లడించాలన్నారు. దేశంలో ఏ ఎమ్మెల్యే దగ్గర లేని విధంగా లక్ష గజాల డాక్యుమెంట్లు, కిలోల కొద్ది బంగారం, వేల కోట్ల ఆస్థుల పత్రాలను ఈడి అటాచ్ చేసిందని గుర్తు చేశారు. పాసుపుస్తకాలు ఇప్పిస్తామని 117మంది రైతుల దగ్గర ఎమ్మెల్యే అనుచరులు డబ్బులు వసూలు చేశారన్నారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అభివృద్ధి పనుల నిధులను దిగ మింగారని, 2014లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆస్తులు ఎంత, 2026 లో ఉన్న ఆస్తులు ఎంత వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గూడెం మహిపాల్ రెడ్డి సోదరులను తన తమ్ముళ్లు అని చెప్పుకోవడం కంటే పార్టనర్ అని చెప్పుకోవడం సమంజసంగా ఉంటుందేమో అని హరీష్ రావు ఆలోచించాలన్నారు. ఆంధ్రా పార్టీ అని అప్పట్లో వైఎస్సార్ సీపీ ర్యాలీని అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలపై లాఠీ చార్జీ చేయించిన మహిపాల్ రెడ్డికి హరీష్ రావు మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే అవినీతిపై నిజాలు తేల్చే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, చంద్రారెడ్డి, రవీందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుని కి పారదర్శకతతో కూడిన సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్

హైదరాబాద్,మార్చి 30 (సిరి న్యూస్ ):



పారదర్శక వినియోగదారుడికి ఎలాంటి ఇబ్బందిలేకుండా సేవలందించడమే తమ శాఖ లక్ష్యమని అందుకోసం అవినీతిని అరికట్టడానికి విద్యుత్ వ్యవస్థలో మార్పులు తీసుకుని వచ్చినట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ విశ్వనాథ్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అవినీతి నిర్మూలన కోసం వినియోగదారుడు ఎవరిని కలవాల్సిన అవసరం లేకుం డానే దరఖాస్తును ఆన్‌లైన్‌లో స్వీకరించడమే కాకుండా, ఎస్టిమేషన్ వేయడంతో పాటు మంజూరి ప్రక్రియలో పెండెన్సీ కూడా ఇ ఫైలింగ్‌లో కనపడుతుందని సీఎండీ తెలిపారు. అవినీతిని తగ్గించే విషయంలో వినియోగదారుల నుంచి కూడా సహకారం ఉండాలని, లంచం తీసుకోవడం ఎంత నెరమో ఇవ్వడం కూడా అంతే నేరమని అన్నారు. శాప్ లో ఇ ఆఫీస్ వచ్చిందని, దీనితో తన కంప్యూటర్‌లో కూడా ఫైల్స్ కనబడుతున్నాయని, ప్రతి అధికారికి వెలుతుందని, దీనితో ఫైల్ ఎక్కడ పెండింగ్ ఉందనే విషయం తెలుస్తుందని అన్నారు. వినియోగదారుడు ఒకసారి దరఖాస్తు చేస్తే ఎవరిని కలవకుండానే మంజూరి అయిపోవాలనేది తమ లక్ష్యం అన్నారు. ఎవరిని కలవకుండా మంజూరి అయిందంటే ఎక్కడ అవినీతి జరగలే దన్నట్లుగా బావించవచ్చన్నారు. ఇక మెటిరీయల్ కొరత లేకుండా ప్రత్యేక దృష్టిని సారించామని, అసలు మెటిరీయల్ కోసం స్టోర్స్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఎక్కడికక్కడ అందుబాటులో ఉంచేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. మీటర్ల కొరత విషయంలో సీఈ లతో కమిటీ ఏర్పాటు చేశామని, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏప్రిల్ 6వ తేదీ నుంచి కమిటీ ప్రోక్యూర్‌మెంట్‌పై దృష్టి సారిస్తుందన్నారు. హైదరాబాద్‌లో కొత్త సర్వీసులు ఎక్కువగా ఉంటున్నాయని, ప్రతి కనెక్షన్ విషయంలో జీటీసీఎస్ రూల్స్ ప్రకారమే వ్యవహారించనున్నట్లు తెలిపారు. యూనిఫామ్ లైన్ సర్వీస్ చార్జీలతో ఫౌరుల మీద భారం తగ్గుతుందన్నారు. రెవెన్యూ లాసెస్‌ను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యూజీ కేబుల్ వల్ల గాలి దుమారంతో చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగడమే కాకుండా, నష్టాలను అధిగమించడానికి ఉపయోగపడుతుందన్నారు. తరచుగా వచ్చే విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి ప్రధాన కారణాలను గుర్తించే పనిలో ఉన్నామని, ప్రధానంగా ఏబీ స్విచ్‌లు సరిగా లేక పోవడం, చెట్ల కొమ్మలు, అకాల వర్షాలతో ఇన్సూ లేటర్లలోకి నీరు వెళ్లడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు. యావరేజ్‌గా 20 నిమిషాల పాటు విద్యుత్ అంతరాయం జరుగుతుందని గుర్తించినట్లు తెలిపారు. చిన్న చిన్న సమస్యలతోనే జరుగుతుందని, వాటిని గుర్తించి అధిగమిస్తామని తెలిపారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్, వినియోగం భారీగా ఉండే అవకాశం ఉందని, వచ్చే ఎండాకాలంలో వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 27న రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 18,548 మెగావాట్లుగా రికార్డు స్థాయి నమోదు అయినట్లు సీఎండీ తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 13న 11,318 మెగావాట్ల డిమాండ్ నమోదు కాగా 222 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందన్నారు. ఏప్రిల్, మే నెలలో విద్యుత్ డిమాండ్, వినియోగం భారీగా పెరుగుతుందని బావిస్తున్నామని, అందుకు అనుగుణంగా తమ అధికారులు సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం డిస్కమ్ పరిధిలో మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం 71 ఆసుపత్రుల నుంచి 260 కార్పోరేట్ ఆసుపత్రులకు పెంచామన్నారు. ఈ ఆసుపత్రుల్లో 8,229 మంది రిటైర్ట్ విద్యుత్ ఉద్యోగులతో పాటు 20,261 సర్వీస్ ఉద్యోగులతో పాటు ఆర్టిజన్లకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. స్పాట్ బిల్లర్స్‌కు ప్రతి నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ మధ్యలో 12 పని దినాలను కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీరి ద్వార స్ట్రక్ మీటర్లు, కాలిపోయిన మీటర్ల వంటి వాటిని గుర్తించి రిప్లేస్‌మెంట్ పనులు పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్ విషయంలో వారం పది రోజుల్లో వారితో సమావేశం నిర్వహించి పరిష్కారం చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఒక ఫోల్‌పై ఏడాదికి రూ. 600 లు చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో చాలా మంది చార్జీలు చెల్లించకుండానే ఉపయోగించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఒక ఫోల్‌కు ఏడాదికి రూ. 100 చెల్లిస్తే సరిపోతుందని, వచ్చే నెలలో కేబుల్స్ వారితో చర్చించి తగిన మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. డబ్బులు చెల్లించిన వారికి ట్యాగ్ చేసి వాటికే అనుమతి ఇస్తామని సీఎండీ జితేష్ వి పాటిల్ అన్నారు.

# ధర్మ పరిరక్షకులు అవధూత గిరి

- మాధవానంద సరస్వతి
- దత్తగిరి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం, మార్చ్ 30{సిరిన్యూస్ }



సనాతన ధర్మ పరిరక్షణ, విశ్వ మానవ ధర్మ ప్రచారం, పేదలకు వైదిక విద్య అందించడం, ప్రభుత్వ వైద్యశాలకు ఉచితంగా కోట్లు విలువచేసే భూదానం, గోసేవ, నిత్యం ఆధ్యాత్మిక చింతనతో కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవాభావంతో ముందుకు సాగుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ అభినందనీయులని రంగంపేట (బసవకళ్యాణ్) పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని శ్రీ దత్త క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. వారికి ముందుగా ఆలయ రాజు గోపురం వద్ద శ్రీపాద స్వామి వైదిక పాఠశాల విద్యార్థుల బృందం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం జ్యోతిర్లింగాలు, దత్తాత్రేయ స్వామి, ఆదిశంకరాచార్యుల అద్దాల మండపం, పంచవృక్షాలు, గోమందిరం తదితర మందిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్‌ను శ్రీ మాధవానంద సరస్వతి పూల మాలశాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, ఆనందగిరి మాత, నందిని గిరి, భక్తులు పాల్గొన్నారు.



# గోరింటాకులో ఔషధ గుణాలు.. మీకు తెలుసా..?

గోరింటాకు.. అంటే తెలియని వారే లేరు. చేతిపై గోరింటాకు పెట్టుకోవడం భారత స్త్రీలకు తరాలుగా వస్తున్న ఆచారం. దీనినే మెహిందీ, మైదాకు అనే పేరుతో పిలుస్తారు. ఈ ఆకును స్త్రీలు చాలా ఇష్టంగా చేతికి పెట్టుకొని ఎర్రగా పండగానే మురిసిపోతూ ఉంటారు. ఇది మగువకు అందాన్ని ఇవ్వడమే కాకుండా గోరింటాకులో కొండంతా ఔషధగుణాలు దాగి ఉన్నాయి. అవేమిటో తెలుసుకుందాం.

ప్రస్తుత పరిస్థితుల్లో గోరింటాకును మర్చిపోతున్నారు ఆడవారు. చాలామంది దానికి బదులుగా రెడీమెడ్ మెహిందీని వాడుతున్నారు. కానీ రానురాను అది చేతి నుంచి ఊడిపోయి.. తినే సమయంలో ఆహారం ద్వారా కడుపులోకి చేరుతుంది. కానీ గోరింటాకు పెట్టుకోవడం వల్ల అలాంటి సమస్యలు ఉండవు.

భారతీయులు అనాదిగా వినియోగిస్తున్న ప్రతి మొక్క లేదా దాని ఉత్పత్తులలో ఔషధ గుణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అలాంటిదే గోరింటాకు కూడా. గోరింటాకును మెత్తగా నూరి అరికాళ్లకు మందంగా రాస్తే అరికాళ్లమంట తగ్గుతుంది. సెగగడ్డలు వచ్చి ఎంతకూ పగలకుండా ఉన్నప్పుడు గోరింటాకు మెత్తగా నూరి సెగ గడ్డలపైన వేస్తే నొప్పి తగ్గుతుంది. మూత్రములో వీర్యం పోతుంటే గోరింటాకు రసాన్ని ప్రతి రోజు చెంచాడు తాగితే మంచి ఫలితం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. వెంట్రుకలు రాలిపోతున్నా, నెరసి పోతున్న గోరింటాకు పట్టించడం వల్ల ఫలితం ఉంటుంది. గోరింటాకు క్రిములను నాశనం చేస్తుంది. కంటికి కనిపించని సూక్ష్మ క్రిములను గోరింటాకు నశింపజేస్తుంది. గోరింటాకును నెలకొక్కసారి చేతికి పెట్టుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గోరింటాకు చెట్టు బెరడు కషాయాన్ని లేదా చూర్ణాన్ని ఉపయోగించి చర్మ వ్యాధులను నివారించవచ్చు. కాలిన గాయాలను. నోటిపూతను, తలనొప్పి, కణుతులు, వ్రణాలు, జుట్టు సమస్యలను నయం చేసుకోవచ్చు. నీరసాన్ని తగ్గించడంలోనూ గోరింటాకు ఉపయోగపడుతుంది. 5 గ్రా. పచ్చి గోరింటాకును తీసుకుని నీటిలో వేసి ఒక రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే గోరింటాకును చేత్తో బాగా నలిపి వడకట్టి ఆ నీటిని ఉదయం పరగడుపున తాగాలి. ఇలా నెల రోజుల పాటు క్రమం తప్పకుండా చేయడం వల్ల ఎంతటి ఎండలో తిరిగినా నీరసం రాకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా రక్తం శుభ్రపడుతుంది. శరీరానికి ఎంతో బలం చేకూరుతుంది.





## ప్లాస్టిక్ కప్పులో టీ తాగుతున్నారా..?

# తస్మాత్ జాగ్రత్త!

టీ..అంటే తెలియని మనిషులే ఉండరు. ఆహా టీ..అంటూ ఆస్వాధిస్తూ చాలా మంది ఇష్టంగా తాగుతుంటారు. ఇది రోజువారీ జీవితంలో తీసుకునే పానీయాల్లో ఒకటిగా మారింది. పనిచేసి అలసిపోయినా.. ఆలోచనలతో తలనొప్పి వచ్చినా చాలా ఆఫీసుల్లో ఎంప్లాయిస్ టీలు ప్లాస్టిక్ కప్పులో తాగుతారు. అయితే ఇది అస్సలు మంచిది కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మీరు కూడా పేపర్ కప్పుల్లో టీ తాగుతున్నారా..? అయితే ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే..

ప్లాస్టిక్ మానవాళికి ఎంత హాని చేస్తుందో ఇప్పటికీ చాలామంది నిపుణులు చెబుతూనే ఉన్నారు. అయినా వీటి వాడకం ఏ మాత్రం తగ్గడం లేదు. పేపర్ కప్పుల్లో టీ తాగితే స్లో పాయిజన్ తాగినట్లేనని వైద్య నిపుణులే చెబుతున్నారు. టీ, కాఫీ లేదా ఏదైనా వేడి పదార్థాలను పేపర్ కప్పులో పోసినప్పుడు మైక్రో ప్లాస్టిక్ పొర కరగడం ప్రారంభమవుతుంది. ఈ పొర నుంచి సూక్ష్మ కణాలు బయటకు విడుదలవుతాయి. అవి కంటికి కనిపించనంత చిన్నగా ఉంటాయి. వీటిని మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే చూడగలం. ఇవి కప్పులోని ద్రవ పదార్థాల్లో కలిసి పోయి జీర్ణాశయంలోకి వెళ్తాయి. ఫలితంగా ప్లాస్టిక్ కణాలు ఆరోగ్యాన్ని దెబ్బతీసి క్యాన్సర్ లాంటి వ్యాధులకు దారి తీస్తాయని నిపుణులు చెప్తున్నారు.

రోజుకి రెండు, మూడు సార్లు పేపర్ కప్పుల్లో టీ తాగే వ్యక్తులకి ప్రతిసారి లోపలికి ప్రవేశించి హాని చేస్తాయంటా. ఇది ఇలానే కొనసాగితే ఎండోక్రైన్ వ్యవస్థ దెబ్బతిని, పునరుత్పత్తి వ్యవస్థపై కూడా ఎఫెక్ట్ పడుతుంది. టీ అనేది బాగా అలసి పోయినప్పుడే తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం చేసే గంట ముందు గంట తర్వాత టీ తీసుకోకపోవడమే మంచిదని సూచిస్తున్నారు.

# వేసవిలో బెస్ట్ స్కిన్ కేర్.. టిప్స్ ఇవే

వేసవి కాలం వచ్చిందంటే.. అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో చర్మంపై ఎన్నో మార్పులు కనిపిస్తాయి. చెమటతో చర్మం జిడ్డుగా మారడం, చర్మం కమిలిపోవడం, త్వరగా నల్లబడటం, ముడుతలు పడి అందవిహీనంగా అయిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నవుతాయి. ఇలాంటి సమయంలో చర్మ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. లేదంటే అందాన్ని కోల్పోయే అవకాశం ఉంది. అయితే ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చు.

వేసవిలో మనిషి శరీరం చాలా తేమను కోల్పోతుంది. కాబట్టి ఎప్పుడికప్పుడు నీటితో హైడ్రేట్ చేయడం చాలా ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. నీరు ఎక్కువగా తాగడం వల్ల చర్మం మృదువుగా, తేమగా ఉంటుంది. అలాగే పండ్లు పుష్కలంగా తినడం వల్ల చర్మం, జీర్ణక్రియ వ్యవస్థ ఆరోగ్యంగా పనిచేస్తుంది. రోజ్ వాటర్‌లోని సహజ శీతలీకరణ లక్షణాలు వేసవికి అద్భుతమైనవి. కాబట్టి దానిని ప్రయత్నించవచ్చు. వీటితో పాటు నిద్ర కూడా చాలా అవసరం.

రోజుకు ఏడెనిమిది గంటలు నిద్రపోవాలి. అలాగే రోజుకు మూడు సార్లు ముఖాన్ని శుభ్రపరుచుకోవడం ముఖ్యం.

వేసవిలో ముఖాన్ని తాజాగా, చల్లగా ఉంచడంలో టమాటాను మించింది లేదు. టమాటో, నిమ్మరసం మిక్స్ చేసి ఫేస్ ప్యాక్‌లా తయారు చేసుకుని ముఖానికి అప్లై చేసి 10 నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత చల్లటి నీటితో కడగాలి.

దీని ద్వారా చర్మం చల్లబడడమే కాకుండా,హైడ్రేట్‌గా ఉంటుంది. ఒకవేళ ఎండలో బయటకు వెళితే ముఖానికి స్కార్ఫ్, కళ్లకు కూలింగ్ గ్లాస్‌లు పెట్టుకోవడం, గొడుగు వాడటం మంచిది. ఎండలో తిరిగి వచ్చిన తర్వాత ఐస్ ప్యాక్ తో చర్మాన్ని మర్దన చేసుకోవడం వల్ల చర్మం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ఎండలోకి వెళ్లకుండా ఉండటం ఉత్తమం.





## మలయాళ స్టార్లతో
# నాని క్రేజీ ప్లాన్!

నాని కేవలం నటుడిగానే కాకుండా, అభిరుచి గల నిర్మాతగానూ టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేశారు. ఇటీవల ఆయన నిర్మించిన 'కోర్ట్' బాక్సాఫీస్ వద్ద చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయాన్ని నమోదు చేయడమే కాక, భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఈ సక్సెస్ ఇచ్చిన జోష్‌తో నాని తన 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెడుతున్నారు. 'కోర్ట్' చిత్రంతో తనను మెప్పించిన దర్శకుడు రామ్ జగదీష్ కు నాని మరో అవకాశం ఇచ్చారు, ఈసారి కాన్వాస్‌ను మరింత పెంచుతూ, లీడ్ రోల్ కోసం మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కథా చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఈ ప్రాజెక్ట్ పై ఒక స్పష్టత రానుందని తెలుస్తోంది, దుల్కర్ గనుక గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఇది వాల్ పోస్టర్ సినిమా నుండి వచ్చే అత్యంత ప్రతిష్టాత్మక చిత్రంగా నిలవడం ఖాయం.


మరోవైపు, 'దండోరా' చిత్రంతో ఆకట్టుకున్న దర్శకుడు మురళీకాంత్ తో కూడా నాని ఒక సినిమా చేసేందుకు సిద్ధమయ్యారని, ఈ సినిమా కోసం 'ప్రేమలు' మరియు 'లోకః - చాప్టర్ 1' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ యువ నటుడు నస్లెన్ ను సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి, ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్ సఫలమైతే నస్లెన్ నేరుగా తెలుగు తెరకు పరిచయం కాబోతున్నాడు. ఇక వీటితో పాటు తన సోదరి దీప్తి గంటా దర్శకత్వంలో కూడా నాని ఒక సినిమా నిర్మించనున్నారు. 'మీట్ క్యూట్' వంటి వెబ్ సిరీస్‌తో తన మార్కును చాటుకున్న దీప్తి, ఈసారి వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేయబోతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ మూడు ప్రాజెక్టులు వచ్చే ఏడాది సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.

## తల్లినయ్యాక ఆడపులిలా
# మారాను: కియారా

అమ్మనయ్యాక తను జీవితాన్ని చూసే విధానమే మారిపోయిందని అంటోంది బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ. హీరోలకు దీటుగా యాక్షన్ సీన్స్‌తో అదరగొట్టే నాయికీమె. ప్రస్తుతం మాతృత్వ దశను ఆస్వాదిస్తున్న కియారా.. తల్లయిన తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పుల గురించి అభిమానులతో పంచుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ''ఇప్పుడు నేను ఆడపులిలా మారానని అనిపిస్తోంది. మునుపటి కంటే నా జీవితాన్ని చూసే కోణం భిన్నంగా ఉంది. ఒక్కోసారి మరేదీ ముఖ్యం కానట్టు అనిపిస్తుంది. కొన్ని సమయాల్లో ప్రతి చిన్న విషయం కూడా ముఖ్యమనే భావన కలుగుతుంది'' అని అంది.

పెళ్లి తర్వాత తన భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో తన బంధం గురించి మాట్లాడుతూ.. ''పెళ్లికి ముందు మా మధ్య ఉన్న సరదా కబుర్లు, కలిసి ప్రయాణాలు చేయడం ఇవేమీ మారలేదు. ఇప్పటికీ మేమిద్దరం కలిసి సినిమాలు చూస్తాం. నటీనటులుగా, సినిమా ప్రేమికులుగా ఆ చిత్రాల గురించి చర్చించుకోవడం మాకు చాలా ఇష్టమ''ని చెప్పుకొచ్చింది.

''నాకు ఎప్పుడూ నటిని అవ్వాలని ఉండేది. చిన్నప్పుడే నాలో ఆ కోరిక ఉందని మా తల్లిదండ్రులు పసిగట్టారు. కానీ ముందుగా చదువు పూర్తి చేయాలని పట్టుబట్టారు. ఆ తర్వాత వారి ప్రోత్సాహంతోనే చిత్రపరిశ్రమలోకి వచ్చాను. వైఫల్యమే ఉత్తమ గురువు అని తెలుసుకున్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. కథలు, పాత్రలతో కనెక్ట్ అయితే.. అంతకు మించి ఆలోచించను. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తాను. నేను దర్శకుడి నటిని. దర్శకుడికి, నటులకి మధ్య ఉండే అనుబంధమే ముఖ్యమని నమ్ముతాను''



## ప్రకాష్ రాజ్ ఇంట్లో తీవ్ర విషాదం..



ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి సువర్ణలత 86 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా మృతి చెందినట్లు తెలుస్తోంది. ఇక ఈరోజు(సోమవారం) సాయంత్రం బెంగళూరులో సువర్ణలత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు. ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తల్లి సువర్ణలత నేపథ్యాన్ని పరిశీలిస్తే... ఆమె హుబ్లీలోని ఒక అనాథ శరణాలయంలో పెరిగారు. నర్సింగ్ విద్య పూర్తి చేసి బ్రతుకుదెరువు కోసం బెంగుళూరు మహా నగరానికి వచ్చారు. సువర్ణలత క్రైస్తవ మతానికి చెందినవారు కాగా, ప్రకాశ్ రాజ్ తండ్రి మంజునాథ్ రాయ్ హిందువు. భిన్నమైన సంస్కృతులు, మతాల నేపథ్యం ఉన్న కుటుంబంలో ప్రకాష్ రాజ్ పెరిగారు. ఇది ప్రకాష్ వ్యక్తిత్వంలో వైవిధ్యానికి కారణమైంది.



# హేమకు క్లీన్ చీట్..

టాలీవుడ్ సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్, అందరికీ సుపరిచితురాలైన నటి హేమ గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న డ్రగ్స్ కేసు వివాదంపై తొలిసారిగా బహిరంగంగా స్పందించారు, ఇటీవల నటి హేమకు క్లీన్ చీట్ వచ్చింది. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో ఆమె తన మనసులోని ఆవేదనను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో డ్రగ్స్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు తనను ఎంతలా కుంగదీశాయో చెబుతూ హేమ కన్నీటి పర్యంతమయ్యారు. "ఒకానొక దశలో భరించలేక చనిపోవాలని కూడా నిర్ణయించుకున్నాను. అంతలా మానసిక వేదనను అనుభవించాను" అని ఆమె పేర్కొన్నారు. తాను ఏ తప్పూ చేయలేదని గట్టిగా నమ్మానని, అందుకే న్యాయపోరాటం చేసి చివరికి కోర్టులో నిర్దోషిగా బయటపడ్డానని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా తనపై బురదజల్లాయని హేమ ఆరోపించారు, ఈ తప్పుడు వార్తల వల్ల తన వ్యక్తిగత జీవితమే కాకుండా, తన కుటుంబ సభ్యులు కూడా సమాజంలో తలదించుకోవాల్సి వచ్చిందని, వారు అనుభవించిన నరకం అంతా ఇంతా కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నిజాయితీగా ఉండే మీడియా తన పక్షాన నిలుస్తుందనే నమ్మకాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇక నటిగా దశాబ్దాల కాలం పాటు ప్రేక్షకులను అలరించిన హేమ, ఈ వివాదం నుండి బయటపడి మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. తనపై నమ్మకం ఉంచిన వారికి భవిష్యత్తులోనూ అండగా ఉంటానని ఆమె ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## సెల్ఫీ ఇస్తుండగా హీరోయిన్'ను
# అక్కడ పట్టుకున్న అభిమాని

కేరళ కుట్టి, టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి హనీ రోజ్ కు అనూహ్యమైన రీతిలో ఒక చేదు అనుభవం ఎదురైంది. కేరళలోని ఒక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వెళ్ళిన ఆమెపై, అభిమానుల ముసుగులో కొందరు వ్యక్తులు అతిగా ప్రవర్తించడంతో సోషల్ మీడియాలో ఇప్పుడు పెద్ద దుమారమే రేగుతోంది. కేరళలో కొత్తగా ప్రారంభమైన ఒక భారీ షాపింగ్ మాల్ ఓపెనింగ్ ఈవెంట్‌కు హనీ రోజ్ హాజరయ్యారు, ఆమెను చూడటానికి వేల సంఖ్యలో అభిమానులు ఎగబడ్డారు. ప్రారంభంలో అంతా సజావుగానే సాగినా, ఒక్కసారిగా అభిమానులు సెల్ఫీల కోసం ఆమె చుట్టూ చేరడంతో పరిస్థితి అదుపు తప్పింది. సెల్ఫీ తీసుకునే క్రమంలో కొందరు వ్యక్తులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఆమెకు అతి దగ్గరగా రావడమే కాకుండా, ఏకంగా ఆమె నడుమును తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి లోనైన హనీ రోజ్, అక్కడికక్కడే షాక్‌కు గురయ్యారు. తనను ఇబ్బంది పెడుతున్నారని గ్రహించిన హనీ రోజ్, వెంటనే ఆ సెల్ఫీ పిచ్చిగాళ్ళ నుంచి దూరంగా జరిగి అక్కడి నుండి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. సినిమా తారలను చూడాలనే ఆరాటం ఉండొచ్చు కానీ, అది అరాచకత్వానికి దారి తీయకూడదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సినీ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ లో కూడా రాజాసాబ్ ఈవెంట్లో నిధి అగర్వాల్ కు సైతం ఇలాంటి చెడు అనుభవమే ఎదురైంది. ఆమెను తాకేందుకు అభిమానులు ప్రయత్నించారు.

## మరో సీనియర్ హీరో
# సరసన ఐశ్వర్యా రాజేష్?

రీసెంట్‌గా విక్టరీ వెంకటేష్ సరసన "సంక్రాంతికి వస్తున్నాం" చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని, టాలీవుడ్‌లో టాలెంటెడ్ నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య రాజేష్ కెరీర్ ఇప్పుడు ఒక ఆసక్తికరమైన మలుపు తిరగబోతోంది. ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు ఏకంగా టాలీవుడ్ మన్మధుడు అక్కినేని నాగార్జున ప్రతిష్టాత్మక చిత్రంలో భాగం కాబోతున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. వెంకటేష్‌తో చేసిన సినిమా సూపర్ హిట్ అయినా, ఐశ్వర్యకు ఆశించిన స్థాయిలో టాలీవుడ్ ఆఫర్లు క్యూ కట్టలేదు. ప్రస్తుతం తిరువీర్ సరసన ఒక ప్రాజెక్ట్ చేస్తున్న ఆమెకు, నాగార్జున సినిమా రూపంలో ఒక 'గోల్డెన్ ఛాన్స్' తలుపు తట్టిందని సమాచారం. నాగార్జున కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన 100వ చిత్రంలో ఒక కీలక పాత్ర కోసం ఐశ్వర్య రాజేష్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది.

ఈ సినిమా కేవలం నాగార్జున 100వ సినిమా కావడం వల్ల మాత్రమే కాదు, ఇందులో నటిస్తున్న తారాగణం వల్ల కూడా విపరీతమైన హైప్ తెచ్చుకుంటోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌లో సీనియర్ నటీమణులు టబు, సుస్మితా సేన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. తమిళ దర్శకుడు రా. కార్తీక్ ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విశేషమేమిటంటే, నాగార్జున స్వయంగా తన సొంత బ్యానర్‌లో ఈ మైల్ స్టోన్ మూవీని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.